# వాగుల వేట.. ఇసుక దోపిడీ!

- ఆంధ్ర నుంచి తెలంగాణకు తరలింపు..
- అశ్వారావుపేటలోనూ అక్రమ తవ్వకాల జోరు
- పగలు రాత్రి తేడా లేదు
- ట్రాక్టర్లతో యథేచ్ఛగా తరలింపు
- భూగర్భ జలాలకు పెనుముప్పు



**అశ్వారావుపేట, సెప్టెంబర్ 03 ( శ్రీ తొలి క్రాంతి):-**

అక్రమ ఇసుక దందాకు అడ్డూ అదుపూ లేకుండా పోతున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు ఇసుక అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలు ఇప్పటికే తీవ్ర చర్చకు దారితీయగా.. ఇదే అదునుగా అశ్వారావుపేట మండలంలోని వాగుల్లోనూ ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాగులు ఖాళీ అవుతున్నా.. ప్రకృతి సంపద కొల్లగొడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మండలానికి ఆనుకుని ఉన్న ఆంధ్ర ప్రాంతం నుంచి ఇసుకను తెలంగాణలోకి తీసుకొచ్చి విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఒకవైపు ఉండగా.. మరోవైపు అశ్వారావుపేట మండల పరిధిలోని పలు వాగులను అక్రమ ఇసుక తవ్వకాలకు అడ్డాగా మార్చుకున్నారనే విమర్శలు ఉన్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుకను తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.

**వాగుల్లో తవ్వకాలు.. ట్రాక్టర్ల పరుగులు**

అనుమతులు ఉన్నాయా.. లేవా అన్నది పట్టించుకోకుండా వాగుల్లో ఇసుకను తవ్వుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇసుకను తవ్వి ట్రాక్టర్లలో నింపుకుని తరలిస్తున్నప్పటికీ సంబంధిత శాఖల పర్యవేక్షణ కనిపించడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రకృతి సంపదను కాపాడాల్సిన అధికారులు స్పందించకపోవడంతో అక్రమార్కులకు మరింత ధైర్యం వస్తున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ఒక్క ట్రాక్టర్.. వేల రూపాయల దందా**

వాగుల్లో నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుకను ఒక్కో ట్రాక్టర్‌కు రూ.6 వేలకుపైగా విక్రయిస్తున్నారనే ప్రచారం స్థానికంగా సాగుతోంది. తక్కువ సమయంలో భారీగా డబ్బు సంపాదించే అవకాశం ఉండటంతో ఇసుక తవ్వకాలు మరింత పెరిగిపోతున్నాయని ప్రజలు అంటున్నారు. వాగుల నుంచి ఇసుక తరలింపు కొనసాగితే భవిష్యత్తులో వాగుల సహజ ప్రవాహంతో పాటు పరిసర ప్రాంతాలపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**భూగర్భ జలాలకు ముప్పు**

అధికంగా ఇసుక తవ్వకాలు జరగడం వల్ల భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో బోర్లలో నీటి నిల్వలు తగ్గుతున్నాయని, సాగునీటి సమస్యలు ఎదురయ్యే పరిస్థితి ఉందని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచి వాగుల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి.. అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాకు అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రకృతి సంపదను పరిరక్షించాల్సిన బాధ్యతను అధికారులు విస్మరించకుండా.. అక్రమ ఇసుక దందా వెనుక ఉన్న వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే వాగులు ఖాళీ కావడమే కాకుండా.. భవిష్యత్తులో నీటి కొరత మరింత తీవ్రరూపం దాల్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం

- యుడైస్ ప్లస్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి
- నూతన అడ్మిషన్లు పెంచేలా కృషి చేయాలి
- సమిష్టి కృషితో విద్యాశాఖ అభివృద్ధి సాధించాలి





**కొత్తగూడెం, సెప్టెంబర్ 3 ( శ్రీ తొలి క్రాంతి):-**

విద్యాశాఖ సమగ్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని, యుడైస్ ప్లస్‌కు అధిక ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో నూతన అడ్మిషన్లను మరింత పెంచేలా కృషి చేయాలని ప్రణాళిక సమన్వయకర్త సతీష్ కుమార్ సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఆనందఖని పాఠశాలలో ఎంఐఎస్, సీసీఓ, సీఆర్పీలతో కలిసి గురువారం మధ్యాహ్నం సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ, క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ఐక్యంగా, సమన్వయంతో పనిచేయాలని కోరారు. పాఠశాలల పనితీరుకు సంబంధించిన నివేదికలను సకాలంలో జిల్లా విద్యాశాఖకు అందిస్తూ విద్యాశాఖ అభివృద్ధికి సహకరించాలని సూచించారు.నూతన అడ్మిషన్లపై ఉన్నతాధికారులు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేలా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పెద్ద ఎత్తున కొత్త విద్యార్థుల చేరికలు జరిగేలా తల్లిదండ్రులకు పాఠశాలల ప్రాధాన్యతను వివరించి, విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల వైపు ఆకర్షించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.అదేవిధంగా పాఠ్యపుస్తకాలు, పని పుస్తకాలు, ఆన్‌లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న పనులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పూర్తి చేయాలని తెలిపారు. యుడైస్ ప్లస్‌లో వివరాల నమోదును అత్యంత ప్రాధాన్యతతో చేపట్టి ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా చూడాలని సూచించారు.ఈ సందర్భంగా ఏఎంఓ మాధవరావు మాట్లాడుతూ అందరూ సమన్వయంతో, ఐక్యంగా పనిచేసి విద్యాశాఖకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.ఈ సమావేశంలో జీసీడీఓ, ఎంఐఎస్, సీసీఓ, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

# మద్యం మాయాజాలం.. ధరల దోపిడీ!

- సిండికేట్ చేతుల్లో అమ్మకాలు.. మద్యం ప్రియుల జేబులకు చిల్లులు
- దుకాణాల్లో ఒక ధర.. బెల్టుల్లో మరో ధర
- ధరల పట్టికలు మాయం.. ఇష్టారాజ్యంగా అమ్మకాలు
- ఎక్సైజ్ నిఘా ఎక్కడ?



**కొత్తగూడెం, సెప్టెంబర్ 3 (తొలి క్రాంతి):**

మద్యం విక్రయాల్లో నిబంధనలు కాగితాలకే పరిమితమవుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మద్యం విక్రయాలు జరగాల్సి ఉండగా.. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిర్ణయించిన ధరలకు మద్యం విక్రయించాల్సి ఉన్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో సిండికేట్‌గా ఏర్పడి ఇష్టారాజ్యంగా ధరలు పెంచి విక్రయిస్తున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లందు, భద్రాచలం, కొత్తగూడెం, పినపాక నియోజకవర్గాల పరిధిలోని పలు మండలాల్లో అధిక ధరల దందా కొనసాగుతున్నదని మద్యం ప్రియులు ఆరోపిస్తున్నారు. అశ్వారావుపేట నియోజకవర్గంలోని అనుపరెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని స్థానికంగా చర్చ జరుగుతోంది. ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల్లోనూ మద్యం విక్రయాల్లో అధిక ధరల వ్యవహారం కొనసాగుతున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ధరల పట్టికలు కనిపించవు**

మద్యం దుకాణాల్లో వినియోగదారులకు స్పష్టంగా కనిపించేలా ధరల పట్టికలు ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ, కొన్ని చోట్ల అవి కనిపించడంలేదని వినియోగదారులు చెబుతున్నారు. దీంతో ఏ బ్రాండ్‌కు ఎంత ధర చెల్లించాలో తెలియని పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు అదనపు ధరలు వసూలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

ఒకే బ్రాండ్‌కు ప్రాంతాన్ని బట్టి ధరలు మారుతున్నాయనే ఫిర్యాదులు కూడా వినిపిస్తున్నాయి. అడిగేవారు లేకపోవడంతో తమ ఇష్టానుసారం ధరలు నిర్ణయించి మద్యం విక్రయిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

**బెల్టు దుకాణాల్లో మరో దందా**

మద్యం దుకాణాల్లో లభించని కొన్ని బ్రాండ్లు బెల్టు దుకాణాల్లో అందుబాటులోకి వస్తున్నాయని వినియోగదారులు చెబుతున్నారు. అయితే అక్కడ వాటిని మరింత అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బెల్టు దుకాణాలపై పర్యవేక్షణ లోపిస్తే అక్రమ విక్రయాలు మరింత విస్తరించే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**సిండికేట్ చేతుల్లో వ్యవహారం?**

కొన్ని ప్రాంతాల్లో మద్యం విక్రయాలు ఒకే వర్గం నియంత్రణలో ఉన్నాయనే ప్రచారం సాగుతోంది. పోటీ లేకపోవడంతో ధరలను తమకు అనుకూలంగా నిర్ణయిస్తూ వినియోగదారులపై భారం మోపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దుకాణాల మధ్య ధరల విషయంలో సమన్వయం ఏర్పడి సిండికేట్ తరహాలో వ్యవహరిస్తున్నారనే చర్చ కూడా స్థానికంగా వినిపిస్తోంది.

**నిఘా పెంచాలి**

మద్యం విక్రయాలపై సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్న దుకాణాలను గుర్తించి చర్యలు తీసుకోవడంతో పాటు.. బెల్టు దుకాణాల్లో జరుగుతున్న అక్రమ విక్రయాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని మద్యం ప్రియులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని మద్యం దుకాణాలు, బెల్టు దుకాణాలపై అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే అధిక ధరల దందాకు అడ్డుకట్ట పడుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ నిబంధనలు ఒకవైపు.. క్షేత్రస్థాయిలో జరుగుతున్న అమ్మకాలు మరోవైపు అన్న పరిస్థితికి ముగింపు పలకాలని కోరుతున్నారు.




# రైతు కన్నీరు.. కాంగ్రెస్ తీరు!

- ములకలపల్లిలో బీఆర్ఎస్ రైతు సదస్సు
- రైతు సమస్యలపై నేతల ధ్వజం
- హామీల అమలుపై నిలదీత

**ములకలపల్లి, సెప్టెంబర్ 3 (శ్రీ తొలి క్రాంతి):-**

కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసి రైతులు, కౌలు రైతులను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తోందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మెచ్చా నాగేశ్వరరావు విమర్శించారు. కేసీఆర్, కేటీఆర్ పిలుపు మేరకు ములకలపల్లి మండలంలో నిర్వహించిన రైతు సదస్సులో ఆయన మాట్లాడారు.ఎన్నికల ముందు 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేస్తామని చెప్పి.. వెయ్యి రోజులు దాటినా రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. రైతుబంధు, రుణమాఫీ అమలులో నిర్లక్ష్యం చూపుతున్నారని, యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు.బీఆర్ఎస్ నేత ఉప్పల వెంకటరమణ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో భద్రంగా దాచుకోమన్న గ్యారెంటీ కార్డులను ఇప్పుడు రైతులు ఎక్కడ పెట్టుకోవాలని ప్రశ్నించారు. దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. దుకాణాల్లో యూరియా లేకపోయినా యాప్‌లో మాత్రం లభ్యత ఎలా చూపిస్తోందని ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు, పార్టీ నాయకులు, యువకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మోసాలపై.. బీఆర్ఎస్ పోరు!

- దమ్మపేటలో నేడు నిరసన
- వంటా–వార్పుతో ఆందోళన
- పెద్దఎత్తున తరలిరావాలని పిలుపు



**అశ్వారావుపేట, సెప్టెంబర్ 03 (శ్రీ తొలి క్రాంతి):-**

కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీల అమలులో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ చేపట్టిన వారం రోజుల నిరసన కార్యక్రమాల్లో భాగంగా మూడో రోజు దమ్మపేట మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు రోడ్డుపై భారీ నిరసన, వంటా–వార్పు కార్యక్రమం నిర్వహించనున్నట్లు అశ్వారావుపేట బీఆర్ఎస్ మండల సమన్వయకర్త జూపల్లి రమణరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఉప్పల వెంకటరమణ, మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ మెచ్చా నాగేశ్వరరావు పాల్గొంటారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.


# పేదల పట్టాలకు.. సీతాలక్ష్మి పట్టుబాటు!




- 4 వేల పట్టాలు పంపిణీ చేయాలి రామవరం వాసులకు హక్కు పత్రాలు
- ఆర్డీవోకు బీఆర్ఎస్ వినతి

**కొత్తగూడెం, సెప్టెంబర్ 03 (శ్రీ తొలి క్రాంతి):-**

పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీపై మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆమె పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ హయాంలో 76 జీవో ప్రకారం మున్సిపాలిటీలో 10 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరయ్యాయని, అందులో సిద్ధంగా ఉన్న 4 వేల పట్టాలను వెంటనే పంపిణీ చేయాలని కోరారు. రామవరం ప్రాంత ప్రజలకు పొజిషన్ ధ్రువపత్రాలు జారీ చేసి వారి సమస్యను పరిష్కరించాలని ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



శ్రీ తొలిక్రాంతి
RNI No : TGTEL/26/A2143 www.tholikranthidaily.com
SRITHOLIKRANTHI

# సమగ్ర సర్వే.. పైసల గోల!



- కష్టపడినోళ్లకు కాసులు లేవు.. తప్ప ఖాతాలతో చెల్లింపులకు గండం
- 18 నెలలైనా అందని పారితోషికం
- తప్పుడు ఖాతాలతో పలువురికి నిలిచిన డబ్బులు
- కలెక్టర్ జోక్యంతోనే సమస్యకు పరిష్కారం?

**కొత్తగూడెం, సెప్టెంబర్ 3 (తొలి క్రాంతి):**

నూతన కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే ఇప్పుడు సర్వేలో పాల్గొన్న పలువురు ఉద్యోగులు, సిబ్బందికి శాపంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంటింటికీ తిరిగి రోజుల తరబడి శ్రమించి సర్వే నిర్వహించిన వారికి ప్రభుత్వం చెల్లించాల్సిన పారితోషికం కొందరికి అందగా, మరికొందరికి మాత్రం నేటికీ అందకపోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పలు మండలాల్లో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహణలో ఉద్యోగులు, కాంట్రాక్టు సిబ్బంది, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తదితరులు కీలకంగా పనిచేశారు. గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ సమాచారాన్ని సేకరించడంతో పాటు, సర్వే వివరాలను నమోదు చేసేందుకు అహర్నిశలు శ్రమించారు. పలువురు సొంత ఖర్చులతో వాహనాలు ఏర్పాటు చేసుకొని గ్రామాల చుట్టూ తిరిగి విధులు నిర్వర్తించినట్లు తెలుస్తోంది. అయితే ఇంతగా కష్టపడినప్పటికీ రావాల్సిన పారితోషికం మాత్రం అందరికీ అందకపోవడంతో సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### తప్పుడు ఖాతా నంబర్లతో తంటాలు

చెల్లింపుల కోసం సిబ్బంది తమ బ్యాంకు ఖాతా వివరాలను అందించినప్పటికీ, కొందరి ఖాతా నంబర్లు తప్పుగా నమోదు కావడం లేదా అధికారులు తప్పుడు ఖాతా వివరాలు పంపడం వల్ల చెల్లింపులు నిలిచిపోయినట్లు బాధితులు చెబుతున్నారు. సరైన ఖాతా వివరాలు ఇచ్చినప్పటికీ, నమోదులో జరిగిన తప్పిదాల కారణంగా తమకు రావాల్సిన డబ్బులు ఇతర ఖాతాలకు వెళ్లాయా? లేక చెల్లింపుల ప్రక్రియలోనే నిలిచిపోయాయా? అన్నది తెలియక పలువురు ఆందోళన చెందుతున్నారు.

### అడిగేవారు లేరు.. చెప్పేవారు లేరు

తమకు రావాల్సిన పారితోషికం కోసం సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా స్పష్టమైన సమాధానం లభించడం లేదని పలువురు సర్వే సిబ్బంది వాపోతున్నారు. ఎవరిని సంప్రదించాలి, ఎవరికి ఫిర్యాదు చేయాలి, తమ సమస్య ఎప్పుడు పరిష్కారమవుతుందో తెలియని పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకే సర్వేలో పనిచేసిన వారిలో కొందరికి చెల్లింపులు జరిగి, మరికొందరికి జరగకపోవడం అధికారుల పనితీరుపై అనుమానాలకు తావిస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### 18 నెలలైనా.. ఎదురుచూపులే!

సమగ్ర కుటుంబ సర్వే పూర్తయి సుమారు 18 నెలలు గడుస్తున్నా, ఇప్పటికీ కొంతమంది సిబ్బందికి తమకు రావాల్సిన పారితోషికం అందకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. గతంలోనూ ఈ సమస్యపై కథనం ప్రచురితమైనప్పటికీ, సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం లభించకపోవడం గమనార్హం. ప్రభుత్వం చెల్లిస్తామని ప్రకటించిన డబ్బుల కోసం ఇంతకాలం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఇప్పటికైనా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర కుటుంబ సర్వేలో పనిచేసిన ప్రతి ఒక్కరి చెల్లింపుల వివరాలను పరిశీలించాలని బాధితులు కోరుతున్నారు. తప్పుడు ఖాతా వివరాల కారణంగా నిలిచిపోయిన చెల్లింపులను గుర్తించి, సరైన ఖాతా వివరాలను నమోదు చేసి వెంటనే బకాయిలు చెల్లించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నెలల తరబడి కష్టపడి పనిచేసిన సిబ్బందికి వారి శ్రమకు తగిన పారితోషికం అందేలా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# కృషి హైస్కూల్‌లో ఘనంగా కృష్ణాష్టమి కోలాహలం..


- రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు సందడి

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 03, :**

సూరారం కాలనీలోని కృషి హైస్కూల్‌లో కరస్పాండెంట్ పోరంకి శ్యామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అలాగే గండిమైసమ్మ కృషి హై స్కూల్ బ్రాంచ్–3లో ప్రిన్సిపల్ నదియా ఆధ్వర్యంలో కృష్ణాష్టమి సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో అలరించారు. చిన్నారుల ముద్దుముద్దు వేషధారణలు, కృష్ణుడి లీలలను ప్రతిబింబించే కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. చిన్నారులు ఉట్టి కొట్టి సందడి చేస్తూ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభ, సృజనాత్మకతను అభినందించారు. విద్యతో పాటు సాంస్కృతిక విలువలను అలవర్చుకోవాలని, విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# దోమల దెబ్బ.. పల్లెల గబ్బు!



- పల్లెల్లో పెరిగిన దోమల బెడద.. జ్వరాలతో ప్రజల అవస్థలు
- పిచ్చి మొక్కలతో దోమలకు ఆవాసాలు
- కరెంటు పోతే కంటిమీద కునుకే లేదు
- పిచికారి కోసం ఎదురుచూపులు

**అశ్వారావుపేట, సెప్టెంబర్ 3 (తొలి క్రాంతి):**

దోమల దెబ్బతో పల్లెలు బెంబేలెత్తుతున్నాయి. ఎక్కడ చూసినా దోమలు గుంపులుగా పెరిగిపోవడం, పిచ్చి మొక్కలు, మురుగు ప్రాంతాలు పేరుకుపోవడంతో గ్రామాల్లో పరిస్థితి దారుణంగా మారుతున్నదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం అయితే చాలు దోమల గుయ్యిగుయ్యి శబ్దాలతో పల్లెలు మారుమోగుతున్నాయని, కరెంటు ఉన్నంతసేపు ఫ్యాన్లతో కాస్త ఉపశమనం పొందుతున్న ప్రజలు విద్యుత్ సరఫరా నిలిచిపోతే దోమల బెడదను తట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు.

అశ్వారావుపేట మండలంలోని పలు గిరిజన గ్రామాలు, తండాలు, గిరిజన గూడాల్లో దోమల సంఖ్య విపరీతంగా పెరిగిపోయిందని స్థానికులు అంటున్నారు. ఇళ్ల పరిసరాల్లో పారిశుద్ధ్య లోపం, పిచ్చి మొక్కలు పెరిగిపోవడం, మురుగు నీరు నిలిచిపోవడం వంటి కారణాలతో దోమలకు అనుకూల వాతావరణం ఏర్పడిందని చెబుతున్నారు.

### జ్వరాల భయం.. ఆసుపత్రుల బాట

దోమల బెడదతో అనేక మంది జ్వరాల బారిన పడుతున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జ్వరం వచ్చిన ప్రతిసారి ప్రభుత్వ వైద్యం అందుబాటులో లేక ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని, వైద్య ఖర్చులు భరించలేక పేద కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయని వాపోతున్నారు. దోమల సమస్యను నిర్లక్ష్యం చేస్తే రానున్న రోజుల్లో వ్యాధుల వ్యాప్తి మరింత పెరిగే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

### నిధులు లేవనే సాకుతోనా?

గ్రామపంచాయతీల్లో నూతన పాలక మండళ్లు ఏర్పడినప్పటికీ పారిశుద్ధ్యంపై ఆశించిన స్థాయిలో దృష్టి కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో దోమల నివారణ చర్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామపంచాయతీలకు నిధులు సక్రమంగా రావడం లేదనే చర్చలు ఉన్నప్పటికీ.. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన పారిశుద్ధ్య సమస్యలను మాత్రం నిర్లక్ష్యం చేయకూడదని స్థానికులు అంటున్నారు.

### పిచికారి చేయించాలి

గ్రామాల్లో పేరుకుపోయిన పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు మురుగు కాలువలను శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు. దోమల నివారణ మందులను విస్తృతంగా పిచికారి చేసి, అవసరమైన ప్రాంతాల్లో నిరంతర పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మండల, జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించి గ్రామపంచాయతీలకు అవసరమైన సహకారం అందించాలని కోరుతున్నారు. ప్రజలు జ్వరాల బారిన పడిన తర్వాత ఆసుపత్రుల చుట్టూ తిరిగే పరిస్థితి రాకముందే అధికారులు మేల్కొని చర్యలు చేపట్టాలని.. పల్లెలను దోమల రహితంగా మార్చేందుకు తక్షణమే పిచికారి, పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని అశ్వారావుపేట మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# వైకల్యం కాదు.. విజయబలం!

- సమాన అవకాశాలే ఆయుధం
- ప్రతిభకు ప్రోత్సాహమే బలం
- హక్కులపై అవగాహన కల్పన






**కొత్తగూడెం, సెప్టెంబర్ 03 (శ్రీ తొలి క్రాంతి):-**

వైకల్యం శరీరానికి మాత్రమేనని.. ఆత్మవిశ్వాసానికి కాదని జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి అన్నారు. అవకాశం కల్పిస్తే దివ్యాంగులు ఎవరికీ తీసిపోరని, వారి ప్రతిభకు సరైన ప్రోత్సాహం అందిస్తే విజయాలను సాధించగలరని పేర్కొన్నారు. దివ్యాంగులకు జాలి చూపడం కాకుండా సమాన అవకాశాలు, సమాన హక్కులు, సమాన గౌరవం కల్పించడమే నిజమైన సామాజిక బాధ్యత అని స్పష్టం చేశారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆనందఖని పాఠశాల ప్రాంగణంలో దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సీఎంఓ రామారావు నేతృత్వంలో, ప్రణాళిక సమన్వయకర్త సతీష్ కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల నుంచి దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.ఈ సందర్భంగా దివ్యాంగుల భద్రత, హక్కులు, వారికి అందాల్సిన సేవలు, ప్రభుత్వ పరంగా కల్పిస్తున్న అవకాశాలపై న్యాయ సలహాదారులు, సంబంధిత అధికారులు అవగాహన కల్పించారు. దివ్యాంగులు తమ హక్కులను తెలుసుకుని వాటిని సాధించుకునేలా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు.కార్యక్రమంలో సీఎంఓ రామారావు, ప్రణాళిక సమన్వయకర్త సతీష్ కుమార్ మాట్లాడుతూ దివ్యాంగుల విద్యాభివృద్ధి, సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా విద్యాశాఖ అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నాయని తెలిపారు. భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన సేవలను అందిస్తూ వారి సామర్థ్యాలను వెలికితీస్తున్నామని పేర్కొన్నారు. భవిత కేంద్రాల సేవలతో అనేక మంది దివ్యాంగ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరిగి, విద్యలో ముందుకు సాగుతున్నారని తెలిపారు.

"వైకల్యాన్ని చూడకండి.. వారి ప్రతిభను చూడండి" అని పిలుపునిస్తూ దివ్యాంగుల పట్ల సమాజ దృక్పథంలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. దివ్యాంగులకు సమాన హక్కులు, సమాన గౌరవం కల్పించడంతో పాటు వారి విద్య, భవిష్యత్తు, అభివృద్ధిపై మరింత శ్రద్ధ చూపాలని కోరారు.ముఖ్యఅతిథి జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి మాట్లాడుతూ దివ్యాంగుల సామర్థ్యాన్ని గుర్తించి ప్రోత్సహిస్తే చదువుల్లో అద్భుతమైన ఫలితాలు సాధించగలరని అన్నారు. వారికి చేయూత అందించడం దానం కాదని.. అది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. దివ్యాంగుల అభివృద్ధి సమాజ ప్రగతికి కొలమానమని తెలిపారు."అవరోధాలు ఎన్నున్నా.. సంకల్పం ఉంటే విజయం దూరం కాదు" అని అన్నారు. దివ్యాంగులు సమాజానికి భారం కాదని, సమాజానికి బలంగా నిలిచే శక్తి అని స్పష్టం చేశారు. ప్రత్యేక అవసరాలు ఉన్నవారిగా కాకుండా.. ప్రత్యేక ప్రతిభ ఉన్నవారిగా దివ్యాంగులను చూడాలని సూచించారు. వారి అడుగులకు అడ్డుగా ఉన్న అవరోధాలను తొలగిస్తే విజయ శిఖరాలను చేరుకునే సత్తా వారిలో ఉందన్నారు.దివ్యాంగ విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు విద్యాశాఖ తరఫున అవసరమైన సహకారం నిరంతరం అందిస్తామని అధికారులు తెలిపారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను ప్రోత్సహిస్తూ వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సీఆర్పీలు, ఐఆర్పీలు, ప్రత్యేక విద్యా బోధకులు, భౌతిక చికిత్స నిపుణులు, దివ్యాంగ విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఎంఐఎస్, సీసీఓలు, జిల్లా విద్యాశాఖ అధికారులు, న్యాయ సలహాదారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు

**రాష్ట్ర ప్రజలకు నామ శుభాకాంక్షలు**
**సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్ష**
**శ్రీకృష్ణుడి ఆశీస్సులు ఉండాలని ప్రార్థన**

**ఖమ్మం, సెప్టెంబర్ 03 (శ్రీ తొలి క్రాంతి):-**

శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. శ్రీకృష్ణుడి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, శాంతి, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.



# వడ్డీ వేట.. గిరిజనులపై వేటు!



- ఏజెన్సీలో యథేచ్ఛగా అక్రమ వడ్డీ దందా
- వ్యవసాయం పేరిట అప్పుల ఉచ్చు
- తండాలు, గూడాల్లో మాఫియా జోరు
- అడ్డుకునే అధికారులేరీ?

**అశ్వారావుపేట, సెప్టెంబర్ 3 (తొలి క్రాంతి):**

ఏజెన్సీ ప్రాంతంలో అక్రమ వడ్డీ వ్యాపారం జోరుగా సాగుతున్నదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పెట్టుబడి, వ్యవసాయం పేరుతో గిరిజనులను అప్పుల ఊబిలోకి దింపుతూ అధిక వడ్డీలు వసూలు చేస్తున్న వడ్డీ వ్యాపారుల దందా రోజురోజుకూ విస్తరిస్తున్నదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని గిరిజన కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని కొందరు వడ్డీ వ్యాపారులు తమ దందాను విచ్చలవిడిగా కొనసాగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అశ్వారావుపేట మండలంలోని పలు గిరిజన తండాలు, గ్రామాల్లో ఈ వ్యవహారం ఎక్కువగా ఉన్నట్లు స్థానికుల ద్వారా తెలుస్తోంది. కోయ గూడాలు, కొండరెడ్ల నివాస ప్రాంతాలు, ఇతర గిరిజన ఆవాసాల్లో వ్యవసాయ పెట్టుబడులు, కుటుంబ అవసరాలు, సాగు ఖర్చుల పేరుతో డబ్బులు అప్పుగా ఇచ్చి భారీ వడ్డీలు వసూలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

### అప్పు ఇస్తారు.. వడ్డీతో వేటాడతారు!

వ్యవసాయానికి పెట్టుబడి అవసరమైన సమయంలో గిరిజన రైతులకు నగదు అందిస్తూ, ఆ తర్వాత అధిక వడ్డీల పేరుతో అసలు కంటే ఎన్నో రెట్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పంట చేతికొచ్చే వరకు వేచి చూడకుండా వడ్డీ చెల్లింపుల కోసం ఒత్తిడి తీసుకురావడం, అప్పు తీర్చలేని పరిస్థితుల్లో మరింత అప్పు చేయించే విధానం కొనసాగుతున్నదని స్థానికులు చెబుతున్నారు. దీంతో అప్పు తీర్చేందుకు మరో అప్పు చేయాల్సిన దుస్థితి ఏర్పడుతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### తండాల్లో దందా.. పట్టించుకునేవారేరీ?

గిరిజన ప్రాంతాల్లో ఆర్థికంగా బలహీనంగా ఉన్న కుటుంబాల పరిస్థితులను ఆసరాగా చేసుకుని కొందరు వడ్డీ వ్యాపారులు తమ కార్యకలాపాలను విస్తరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. గ్రామాలు, తండాల్లోనే నగదు లావాదేవీలు నిర్వహిస్తూ అధిక వడ్డీలను వసూలు చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆపేవారు లేక.. అడిగేవారు లేక.. చర్యలు తీసుకునేవారు కనిపించకపోవడంతో వడ్డీ దందా మరింత పెరిగిపోతున్నదని ప్రజలు అంటున్నారు.

### గిరిజనులను కాపాడాలి

అక్రమ వడ్డీ వ్యాపారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, ఏజెన్సీ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించాలని గిరిజనులు కోరుతున్నారు. వ్యవసాయం పేరుతో సాగుతున్న అధిక వడ్డీ దందాను అరికట్టి, అప్పుల ఊబిలో చిక్కుకున్న గిరిజన కుటుంబాలకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అక్రమంగా వడ్డీ వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, గిరిజన ప్రాంతాల్లో ఇలాంటి దోపిడీకి అడ్డుకట్ట వేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

